1089

# CS (MAIN) EXAM, 2010

A-DTN-K-JM-22

# TELUGU

## (Compulsory)

*Time Allowed : Three Hours*

*Maximum Marks : 300*

### *INSTRUCTIONS*

***Candidates should attempt all questions.***

***The number of marks carried by each question is indicated at the end of the question.***

***Answers must be written in Telugu, unless otherwise directed.***

***In the case of Question No. 3, marks will be deducted if the précis is much longer or shorter than the prescribed length.***

1. ఈ క్రింది వాటిలో ఒక దానిని గురించి సుమారు 300 పదాల్లో వ్యాసం రాయండి : *100*

   (a) చట్టం గౌరవహత్యలను ఆపగలుగుతుందా ?

   (b) ఆహార పదార్థాల కల్తీవల్ల ఎదురౌతున్న సమస్యలు.

   (c) మూఢనమ్మకాలు – హేతువాదం.

   (d) విద్య – సామాజిక పరిణామం.

   (e) సమాచార హక్కు చట్టం న్యాయబద్ధమైన సుపరిపాలనకు హామీ ఇస్తుందా ?

2. ఈ క్రింది ఖండికను జాగ్రత్తగా చదివి, దాని చివర ఇచ్చిన ప్రశ్నలకు మీ సొంత మాటల్లో సమాధానాలు రాయండి. *10×6=60*

తరగని ఇంధన వనరులను సమకూర్చుకునే క్రమంలో కాలక్రమేణా అధిక వ్యయానికి, కొరతకూ అవకాశం ఉన్న భూగర్భ ఇంధనం మీద ఆధారపడటాన్ని తగ్గించుకోటానికి సౌరశక్తి మాత్రమే సరియైన మార్గం. మన భూగ్రహ పర్యావరణ సమతౌల్యాన్ని నిలుపుకోటానికి, పెరుగుతున్న ఉపరితల తాపాధిక్యతను తగ్గించటానికి సౌరశక్తి వాడకం కీలకమైనది. సౌరశక్తి వాడకంలో ఎన్నో సుగుణాలు ఉన్నప్పటికీ మనం ఇంకా దాన్ని విరివిగా వాడటంలేదు. దాన్ని భూగర్భ వనరులకు ప్రత్యామ్నాయంగా కూడా పరిగణించటం లేదు. దీనికి కారణం సౌరశక్తి సాంకేతికత మూల్యం తక్కిన వాటికంటె ఎక్కువ అనే అభిప్రాయం. అయినప్పటికీ ఏటేటా సౌరశక్తి సాంకేతికతలో చెప్పుకోదగిన అభివృద్ధి సాధిస్తూనే ఉన్నాం. దానివల్ల మెల్లమెల్లగానైనా ఖచ్చితంగానే ఖర్చులు తగ్గుతూ సౌరశక్తి ఒక ఆచరణీయమైన ప్రత్యామ్నాయం అవుతున్నది. ప్రభుత్వం జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ సోలార్ మిషన్ అనే సంస్థను స్థాపించటాన్ని ఆధారపడ దగిన పరిశుభ్రమైన ఇంధన వనరుల దిశలో ఒక ముందుచూపు చర్యగా పరిగణించాలి.

ఆకారణంగా సౌరశక్తి రంగం ఉద్యోగ కల్పనలో ఒక ఆశాకిరణంగా ముందుకు వస్తున్నది. ఈ రంగం పరిశోధనల కొరకూ సాంకేతిక నవకల్పనల కొరకూ పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి ఉద్యోగ కల్పన చేస్తున్నది. అది అందిస్తున్న ఉద్యోగాలు ఉన్నత స్థాయి నిపుణతతో కూడినవీ, ఉన్నత శ్రేణికి చెందినవీ.

శక్తి ఉత్పాదన విషయంలో భారతదేశం ప్రపంచంలో ఆరో స్థానంలో ఉన్నప్పటికీ ఇంకా శక్తి కొరత సంక్షోభం ఎక్కువగానే ఉంది. సౌరశక్తి ఈ సంక్షోభాన్ని తగ్గించ గలదు. అది ఒక పరిపూర్ణమైన వ్యవస్థగా అభివృద్ధి చెంది సౌర పరికరాల నిర్మాణంలో మంచి గిరాకీని సృష్టించ గలదు. ఇవ్వేళ ఎక్కువ అవకాశాలు ఉన్న సౌర ఉద్యోగాలు ఇన్‌స్టలేషన్ రంగంలోనూ, ఇంజనీరింగ్ సిస్టమ్ రూపకల్పన లోనూ ఉన్నాయి. ఈ పరిశ్రమ బాగా ఎదగాలంటే నాణ్యతను పెంచటం ద్వారా, ఉత్పత్తి వ్యయం తగ్గించటం ద్వారా, సిస్టమ్స్ వ్యయాల ఆధిక్యతను తగ్గించటం ద్వారా సౌరశక్తికి అయ్యే ఖర్చును తగ్గించటం తప్పనిసరి.

ప్రశ్నలు :

(a) భూగర్భ ఇంధనం మీద ఆధారపడటాన్ని ఎందుకు తగ్గించుకోవాలి ?

(b) సౌరశక్తి వాడకం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి ?

(c) ఇప్పటి దాకా సౌరశక్తి వాడకం ఎందుకు ప్రజాదరణ పొందలేదు ?

(d) సౌరశక్తిని సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురావటానికి జరుగుతున్న కృషి ఏమిటి ?

(e) సౌరశక్తి రంగం యువతకు ఉన్నత స్థాయి నిపుణత గల ఉద్యోగాలను ఏ విధంగా అందుబాటులోకి తేగలుగుతుంది ?

(f) సౌరశక్తిని తక్కువ ఖర్చుతో కూడినదిగా ఎట్లా చెయ్యవచ్చు ?

3. ఈ క్రింది ఖండికను చదివి అర్థంచేసుకొని ఉన్న దాని కంటె మూడో వంతు పరిమాణానికి తగ్గించి సంక్షిప్త వ్యాసం వ్రాయండి. దీనికి శీర్షికను సూచించే అవసరం లేదు. సూచించిన విధంగా మూడో వంతుకు ఎక్కువగానీ తక్కువగాని ఉన్నట్లైతే దానికి తగినట్లుగా మార్కులు తగ్గించబడతాయి. సంక్షిప్తవ్యాసాన్ని ప్రత్యేకంగా అందించిన పత్రాలలో వ్రాసి వాటిని జాగ్రత్తగా మీ సమాధాన పుస్తకంతో చేర్చి దారం కట్టి జతపరచండి. *60*

కళ ప్రతి ఒక్క తరానికి తగిన అభివ్యక్తిని సమకూర్చ వలసి వస్తే అది గత కాలపు హద్దుల బిగువును సడలించి, పాత భావాల ఆలోచనా

విధానాల పరిమితులను విదళించ వలసి ఉంటుంది. జీవితం ఒక అనంత వాహిని. మార్పులు వేగవంతమైనవీ, మౌలికమైనవీ అయిన విప్లవ కాలంలో దాని పోకడ కూడా వేగవంతమౌతుంది. అటువంటి కాలంలో సామాజిక అవసరాలు సంస్కృతిలో పురోగమనాన్ని తప్పనిసరి చేస్తాయి. అప్పుడు పాత విలువల మూలాలలో కదలిక ఏర్పడి, దానివల్ల పాత పద్ధతులకూ కొత్తగా ఏర్పడి నిలదొక్కుకుంటున్న మార్పులకూ మధ్య ఘర్షణ తలెత్తుతుంది. మార్పులకు భయపడుతూ యథాపూర్వస్థితి కొనసాగటానికి తెగింపుతో ప్రయత్నించే ప్రాచీన సంస్కృతిని ప్రేమించేవారు తమను తాము నైతిక సాంస్కృతిక విలువల సంరక్షకులుగా ప్రకటించుకుంటారు. కొత్తగా వస్తున్న మార్పుల అలలను అడ్డుకుంటూ ఉంటారు. మార్పులను ఆదరించేవారు పాత విలువలను పాత పద్ధతులను ఎదిరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఇక కళా విషయానికి వస్తే సామాజిక పరిణామంలోని ప్రతి దశకూ సంబంధించిన అవసరాలను వ్యక్తం చేయటానికి పాత తరం వారు నిర్మించిన పాత సాంస్కృతిక కళారూపాలు సరిపోవు. అందువల్ల ఆధునిక అవసరాలకు, భావాల అభివ్యక్తికి సరిపడే కొత్త సాంస్కృతిక కళా రూపాలు అవసరం అవుతాయి. ఇట్లా ఒక్కొక్క పరిణామ దశకూ ఒక్కొక్క నూతన కళారూపం అవసరం అవుతుంది. ఇట్లా

పాతకూ కొత్తకూ మధ్య ఒక సంఘర్షణ ఏర్పడుతుంది. ఈ సంఘర్షణలో పాత సంస్కృతిని సమర్థించేవారు — ఒకప్పుడు తామే నిందించి తిరస్కరించిన — అనాగరక చర్యలకు పాల్పడతారు. దీనికి కారణం, ఒక విధానం అభ్యుదయతను కోల్పోయినప్పుడు అణచివేసేదిగా మారిపోతుంది. అందువల్ల కొత్త సమాజం మాత్రమే కళాకారునికి అన్ని సంస్కృతీ విజ్ఞాన రంగాలలోనూ పూర్తి అభివృద్ధి సాధించటానికి కావలసిన అవకాశాన్ని అందించగలదు.

ఈ రోజు ఒక తాత్త్వికుడికీ ఒక విజ్ఞాన వేత్తకూ సంబంధం లేదు; ఒక కళాకారుడికీ ఒక ఇంజనీరుకూ సంబంధం లేదు. కాని వీరందరూ ఒకరి నుండి మరొకరు స్ఫూర్తి పొందవలసిన అవిభాజ్యమైన చైతన్య పూరితమైన జీవనపు గొప్ప అల్లికలో భాగంగా ఉండి సమాజ సమగ్రతకు ఒక సమతౌల్యం గల సుందరమైన ఆకృతిని కలిగించ వలసినవారు. కాని, అన్ని వృత్తులూ ఒకదాని నుండి మరొకటి వేరుపడి పొందిక కోల్పోయిన సమాజం వల్ల జీవన విధానాల సంయోజనకు భంగం ఏర్పడింది. నిజానికి నేటి అవసరం చెప్ప వలసి వస్తే — ఒక యంత్రాన్ని కేవలం కొన్ని స్థిరమైన రేఖాగణిత సూత్రాల మీద ఆధారపడిన నిర్మాణం గానో, కాలుష్యాన్ని సృష్టిస్తూ పొగను వదిలే రూపంగానో,

భావోద్వేగాలు లేని ఒక వస్తువుగానో కాకుండా ఆకాశం కింద పరివ్యాప్తమై ఉన్న పరిసరాలలో భాగమై, పురాతన చారిత్రక కథనాలవలె వీరోచిత చైతన్యంతో కదిలేందుకు సమర్థవంతంగా మలచబడి జీవిస్తున్న ఆకృతిగా చూడటం అలవరచు కోవాలి. నేడు యంత్రాలు మనిషి అవయవాలకు కొనసాగింపులుగా మారిపోయాయి. అవి ప్రకృతి శక్తులమీద మానవుడు స్థాపించిన అధికారాన్ని, పంచభూతాలపై అతడు సాధించిన విజయాన్ని నిరూపిస్తాయి. ఈ పోరాటం మానవుడంత పురాతనమైనది. ప్రకృతీకీ మానవునికీ జరుగుతున్న ఈ పెనుగులాటలో ఒక సౌందర్యం ఉంది; ఒక లయ ఉంది; అది సంగీత భరితమైనది; వర్ణ భరితమైనది.

ఒకవేళ మానవుడు తన తెలివితక్కువ తనం వల్ల యంత్రాన్ని తన మీద ఆధిపత్యం చెలాయించ నిస్తుంటే అది యంత్రం తప్పుకాదు. అది మానవుడి సృష్టి : నిర్మించటం, నాశనం చెయ్యటం ఆతని చేతిలోని పని. మరొక మాట ! కావాలంటే మనం ఆకలిని నిందించ వచ్చు — అది మనల్ని లొంగదీసుకుంటున్నది కనుక. కాని యంత్రాన్ని కాదు. రేడియో అనేది మానవుని ఊపిరితిత్తులను, టెలిఫోన్ అనేది చెవులనూ పెద్దవి చేసి చూపే పరికరాలు మాత్రమే. విమానం మీద నొసలు

చిట్లించి, కిర్రుకిర్రు మంటూ సాగే ఎడ్లబండిని కీర్తించటం కవిత్వ పరంగా కూడా న్యాయం కాదు. అది కొత్తను మెచ్చుకోలేని పక్షపాత దృష్టి. ఆమాటకొస్తే, పాత తక్కువది అనికాదు. నాగలిని చూడండి. ట్రాక్టర్ ఈ నాడు ఎంత సంచలనాత్మక నిర్మాణమో ఆనాడు నాగలి అంత సంచలనాత్మక నిర్మాణం ! మానవుడిలోని కొత్తకొత్త పరికరాలను ఆవిష్కరించ గల నేర్పరితనాన్ని గుర్తించకపోవటం సామాజిక పరిణామాలను గుర్తించకపోవటంతో సమానం. నిజమైన కళాకారుడు అట్లా చెయ్యడు. రివేరా డియోగో అనే గోప్ప మెక్సికన్ కళాకారుడు ఇట్లా అంటాడు.

"కళాకారుడనేవాడు సృష్టించేది ప్రాణశక్తినీ, చైతన్యాన్నీ మాత్రమే ! ఒక చెట్టు పువ్వులను పండ్లను సృష్టించినట్లు ! అవి రాలిపోతే ఆ చెట్టు దుఃఖించదు. ఎందుకంటే అది మళ్ళీ మళ్ళీ పూస్తుంది, కాస్తుంది !"

కళ ఉన్నదాన్ని మాత్రమే కాదు రాబోయేదాన్ని కూడా సృష్టించాలి. సగటు భావాలనే కాదు — గాఢమైన అంతర్భావనలను కూడా సృష్టించాలి. కేవలం లోపాలను చూపి అధైర్యపరచటం కాదు — భవితవ్య పరిణామాలను కూడా చూపించాలి.

4. ఈ క్రింది ఆంగ్ల ఖండికను తెలుగులోకి అనువదించండి : 20

The world does not need extraordinarily talented people. It does not need highly skilled people either. It has plenty of super-intelligent people. We need ordinary people with extraordinary motivation. M.K. Gandhi was an ordinary man with amazing motivation to establish truth and justice. The Wright brothers were ordinary people with a dream of flying.

You can also achieve exceptional results if you are inspired with a higher ideal. Replacing 'inspiration' with 'information' has led to knowledge being viewed as drudgery rather than as pleasure. Education has degenerated to data being transmitted from the teacher to the taught without igniting the minds of the young with a higher purpose.

How many of us wake up inspired, looking forward to a day of service ? Who among us finds exhilaration in contributing to society ? Life changes magically from boredom to excitement when you are inspired to serve. You redefine norms and achieve the impossible, paving the way to outstanding success. You find happiness at work, not in escaping from it. Most importantly, you evolve spiritually and attain Godhood.

Inspiration gives ordinary people the courage and hope to make life better for themselves and for posterity. Find inspiration and life will transform into an exciting adventure of self-discovery.

5. ఈ క్రింది తెలుగు ఖండికను ఆంగ్లంలోకి అనువదించండి : 20

విజ్ఞానశాస్త్రానికి గల సామాజిక బాధ్యతలను గురించి ఈ రోజు నేను మాట్లాడే దాంట్లో సాపేక్షకంగా యువజనులకు సులభంగా అర్థమయ్యేవీ, పెద్దలకు మాత్రం కష్టతరమైనవీ మాట్లాడ్తాను. ఎందుకంటే యువజనులలో ఉండే ఒక గుణం సామాన్యంగా వయస్సు పెరిగిన కొద్దీ తరిగిపోతుంది. అది భావనా శక్తి. భావన అనే గుణం విజ్ఞాన శాస్త్రంతో మమేకమైన ఒక గుణం. అది ప్రాకృతికంగా యువజనులకు ప్రసాదించబడింది. విచారించ వలసిన సంగతేమిటంటే — వయస్సు పైనబడుతున్న కొద్దీ ఆ గుణం ఇగిరిపోతుంది. అయినప్పటికీ మన అసంతోష ప్రపంచానికి ఆ గణం ప్రస్తుత కాలంలో అమితంగా కావలసి ఉంది.

గత మూడు శతాబ్దాలుగా విజ్ఞానశాస్త్రం కనిపెట్టినవి సమాజం మీద స్పష్టమై గుర్తించదగిన ప్రభావాన్ని కలిగించాయి. కాని మొత్తంమీద ప్రజలు దాని వల్ల మన ప్రపంచం ఎంతగా విపరిణామానికి గురైందో అర్థం చేసుకోలేదు; కనీసం అందుకు శ్రద్ధ చూపలేదు. న్యూటన్ కాలంనించీ కూడా విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణల ఆధారంగా వచ్చిన సాంకేతికత ద్వారా చెప్పుకోదగినంతగా సుఖాలను, లాభాలను పొందగలం అని మనుషులు గ్రహించటం మొదలుపెట్టారు. విజ్ఞానశాస్త్రాన్ని వైద్యశాస్త్రానికి అనువర్తనం చెయ్యటం వల్ల దీర్ఘకాలం బతకవచ్చు అని కూడా ప్రజలు తెలుసుకోటం మొదలు పెట్టారు.

లియొనార్డో ద వించి (Leonardo da Vinci) కాలం నించి ప్రజలు విజ్ఞానశాస్త్రం యుద్ధాలు గెలవటంలో కూడా భౌతికంగా సాయపడుతుంది అని గుర్తించారు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సాంకేతిక భౌతికవాదం అభివృద్ధి చేయబడింది. కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానం కొరకు పెద్ద పెద్ద గొంతుకలతో డిమాండ్లు వినిపించసాగాయి. ఎక్కువమంది మనుషులు విజ్ఞానశాస్త్రవేత్తలు సాంకేతిక శాస్త్రవేత్తలు అయ్యారు.

6. (a) ఈ క్రింది వాటిని మీ సొంత వాక్యాల్లో ప్రయోగించండి : *10×2=20*

(i) వంటింటి కుందేలు

(ii) అడవిగాచిన వెన్నెల

(iii) వడ్డించిన విస్తరి

(iv) సముద్రంలో నీటిబొట్టు

(v) తలలో నాలుక

(vi) ఊదరగొట్టటం

(vii) నత్తనడక

(viii) స్వర్గానికి నిచ్చెనలు

(ix) కాళ్ళ బేరాలు

(x) లక్ష్మణ రేఖ

(b) ఈ క్రింది వాటికి సమానార్థక పదాలు రాయండి : *10×2=20*

(i) వేడికోలు

(ii) రీతి

(iii) తేరు

(iv) రజతం

(v) కదలి

(vi) దరహాసం

(vii) ఆశీర్వాదం

(viii) ఏవగింపు

(ix) కూష్మాండం

(x) పుడమి